# విభారే
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి శుక్రవారం 15-11-2024 సంపుటి : 06 సంచిక : 48 పేజీలు : 8 వెల : రూ 3-00


**బడుగు బలహీన వర్గాలకు అండగా ఉంటా... ఏపీ రజక వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సి సావిత్రి**

భారతీయ జనతా పార్టీ బృందం ఆధ్వర్యంలో స్థానిక కర్నూలు నగరం నందు ఎన్డీఏ కూటమిలో భాగంగా ఏపీ రజక వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ గా నియమితులైన సి సావిత్రి అడ్వకేట్ ను ఘనంగా సన్మానించిన బిజెపి నాయకులు. చైర్మన్ పదవి కట్టబెట్టడంతో ఎన్డీఏ ఆది నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ సి సావిత్రి మాట్లాడుతూ రజకులు కుల వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, అదేవిధంగా రజకుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, వారి యొక్క స్థితిగతులను త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తారని, వారిని అభివృద్ధిపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో మమేకమై రజకులను అన్ని విధాలుగా ఆదుకుంటుంది






## ఏపీ డిప్యూటీ స్పీకర్‌గా రఘురామకృష్ణరాజు ఏకగ్రీవ ఎన్నిక



అమరావతి : ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా రఘురామకృష్ణరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత నాలుగురోజులుగా జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల సందర్భంగా కూటమి ప్రభుత్వం డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్, విప్‌ల పేర్లను ప్రకటించింది. ఈ సందర్భంగా నిన్న డిప్యూటీ స్పీకర్ పదవికి రఘురామకృష్ణరాజు నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పేరును మంత్రి నారా లోకేష డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ విప్ విష్ణుకుమార్‌రాజు ప్రతిపాదించారు. ఒకే ఒక నామినేషన్ రావడంతో డిప్యూటీ స్పీకర్‌గా రఘురామకృష్ణరాజు ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు స్పీకర్ అయ్యన్నపాత్రుడు గురువారం శాసనసభలో ప్రకటించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉండి నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. గత వైసీపీ హయాంలో నరసాపురం లోక్‌సభ స్థానం నుంచి వైసీపీ పోటీగా గెలిచారు. అప్పటి సీఎం జగన్ విధానాలు నచ్చక పార్టీలోనే ఉంటూ పార్టీకి, పార్టీ అధ్యక్షుడికి వ్యతిరేకంగా దాదాపు మూడు సంవత్సరాల పాటు బాహాటంగా విమర్శలు చేశారు. దీంతో ఆగ్రహించిన వైసీపీ సర్కార్ రఘురామకృష్ణరాజుపై రాజద్రోహం కేసుపెట్టింది.

## పారిశ్రామిక పాలసీ రూపకల్పనపై చంద్రబాబు కీలక నిర్ణయం



అమరావతి: పోర్టు ఆధారిత పరిశ్రమలు తీసుకువచ్చి ఏపీని అభివృద్ధి పథంలో నిలుపుతామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. గడచిన ఐదేళ్లలో 227 ఎంఓయూలు జరిగినా పైసా పెట్టుబడి రాష్ట్రానికి రాలేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పన్నులు, కరెంటు ఛార్జీలు పెంచటం వల్ల పరిశ్రమలు, ఎవరూ మనుగడ సాధించలేని పరిస్థితి ఉందని సీఎం చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ఇవ్వకుండా అప్పులు పెట్టారని విమర్శలు చేశారు. 1995 కంటే ముందు లైసెన్స్ రాజ్ కారణంగా పెట్టుబడులు రాలేదని గుర్తుచేశారు. ఆ తర్వాత ఆర్థిక సంస్కరణల కారణంగా ఏపీలోనూ ఐటీని ప్రోత్సహించగలిగామని ఉద్ఘాటించారు. ప్రతీ నలుగురు ఐటీ నిపుణుల్లో ఒకరు తెలుగువారే ఉన్నారంటే అప్పటి విధానపరమైన నిర్ణయమేనని సీఎం చంద్రబాబు తెలిపారు. “2047కి భారత్ నెంబర్‌వన్ దేశంగా తయారైతే ఏపీ కూడా దేశంలోనే నెంబర్ వన్‌గా ఉండాలనేలా ఈ పాలసీలు తీసుకొచ్చాం. యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే మా ప్రాధాన్యత. ఈజ్ ఆఫ్ డూయింగ్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌గా విధానం మార్చుకున్నాం. ఉత్పత్తి వ్యయం తగ్గించటం, బ్రాండ్ ఇలా అన్ని అంశాల్లోనూ దృష్టి పెట్టాం. ప్రతీ కుటుంబంలోనూ ఒక పారిశ్రామిక వేత్త అనే నినాదాన్ని సాధ్యం చేసి చూపుతాం. పెట్టుబడి ప్రాజెక్టులు అనుకున్న సమయానికే మొదలయ్యేలా ఓ ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేస్తాం. రియల్ టైమ్‌లోనే అనుమతుల జారీ, సెల్ఫ్ సర్టిఫికేషన్ అంశాన్ని కూడా తీసుకురావాలని భావిస్తున్నాం. సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమలను కూడా పెద్ద ఎత్తున ఏర్పాటు చేయాలన్నది మా లక్ష్యం” అని సీఎం చంద్రబాబు వెల్లడించారు. “ఉత్పత్తిలో ఏపీని గ్లోబల్ డెస్టినేషన్‌గా మార్చాలన్నది మా ప్రభుత్వ విధానం. ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ అన్ని రాష్ట్రాల విధానాలను అధ్యయనం చేసి రూపొందించాం. ఏ విధానమైనా 2024-29 వరకూ అమల్లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. మొత్తంగా 30 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు రావాలన్నది మా లక్ష్యం.

## ప్రధాని మోడీకి డొమినికా దేశపు అత్యున్నత పురస్కారం



రోసో: కరేబియన్ దేశమైన డొమినికా దేశం గురువారం ఆ దేశ అత్యున్నత పురస్కారం ‘కామన్వెల్త్ ఆఫ్ డొమినికా’ అనే పురస్కారాన్ని భారత ప్రధాని నరేంద్ర మోడీకి ప్రకటించింది. కోవిడ్-19 మహమ్మారి కాలంలో భారత్ అందించని సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును ప్రకటించారు. 2021 ఫిబ్రవరి నెలలో దాదాపు 70,000 డోసుల ‘ఆస్ట్రాజెన్కా కొవిడ్-19 వ్యాక్సిన్ ను ఇండియా, డొమినాకా దేశానికి పంపింది. ప్రధాని మోడీకి ప్రకటించిన ఈ అవార్డును డిమినికా అధ్యక్షుడు సిల్వానీ బర్టన్ ఇండియా-కారికోమ్ సమాశంలో ప్రదానం చేస్తారు. అది గయానాలోని జార్జ్ టౌన్ లో నవంబర్ 19 నుంచి జరుగనుంది.

## వైసీపీ, టీడీపీ సభ్యుల మధ్య వాగ్వాదం

### వైసీపీ నేతలను నిలదీసిన మంత్రి లోకేశ్‌కుమార్

అమరావతి, నవంబర్ 14 : ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలో గురువారం వైసీపీ, టీడీపీ సభ్యుల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్.. అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకుండా పారిపోయారంటూ మంత్రి డోలా ఎద్దేవా చేశారు. మంత్రి డోలా వ్యాఖ్యలపై వైసీపీ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 2014 19 మధ్య నాటి ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడు పారిపోలేదా? అంటూ టీడీపీ సభ్యులను వైసీపీ సభ్యులు నిలదీశారు. దీంతో వైసీపీ ఎమ్మెల్సీల వ్యాఖ్యలపై ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ మండిపడ్డారు. గత ప్రభుత్వంపై చంద్రబాబు రెండేళ్లు సభలో ఉండి పోరాడిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తన తల్లిని అవమానించడంతోనే సభను నుంచి ఆయన చాలెంజ్ చేసి వెళ్లిపోయారన్నారు. అయినా చంద్రబాబు అసెంబ్లీకి రాకున్నా.. తమ పార్టీ ఎమ్మెల్యేలు వచ్చారన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలు సభకు ఎందుకు రావడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ వెంటనే ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ జోక్యం చేసుకున్నారు. తల్లిని అవమానించిన వారిని తాము ప్రోత్సహించమని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వారికి టికెట్లు ఇస్తే.. ప్రోత్సహించినట్లు కాదా? అని బొత్స సత్యనారాయణను ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ ప్రశ్నించారు.

## రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల భద్రతను గాలికొదిలేసిన కూటమి : విజయసాయి రెడ్డి

అమరావతి : ఏపీలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను చూస్తుంటే కూటమి ప్రభుత్వం ప్రజల భద్రతను గాలికొదిలేసినట్లు ఉందని వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి విమర్శించారు. గురువారం ట్విట్టర్ వేదిక ద్వారా ప్రభుత్వ తీరును ప్రశ్నించారు. సైబర్ నేరాలు మహిళలపై అరాచకాలు పెరుగుతున్నా వాటి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు.

## రుషికొండపై వాడీవేడిగా చర్చ



### ఆర్టీఐ చట్టం కింద దరఖాస్తు చేస్తేనే సమాధానం వచ్చింది


అమరావతి, నవంబర్ 14 : ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మూడో రోజు గురువారం ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యాయి. ప్రశ్నోత్తరాల సమయం కొనసాగుతోంది. ఈ సందర్భంగా విశాఖలో రుషికొండపై నిర్మించిన ప్యాలెస్‌పై అసెంబ్లీలో వాడి వేడిగా చర్చ జరిగింది. ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ.. రుషికొండపై నిర్మాణాలకు రూ. 409 కోట్లు కేటాయించారని, ఈ నిర్మాణాలు జగన్ విధ్వంసానికి పరాకాష్ట అని అన్నారు. అక్కడకు ఎవరిని వెళ్లనీవ్వకుండా అడ్డుకున్నారని, మేము ఆర్టీఐ చట్టం కింద దరఖాస్తు చేస్తే అతి కష్టం మీద నెల తరువాత సమాధానం వచ్చిందన్నారు. రుషికొండ రిసార్ట్సను జగన్ కావాలనే డిస్ట్రక్షన్ ప్రారంభించారని, రిసార్డ్‌లను కూల్చేసి ఏమి కడుతున్నారో కూడా ఎవరికీ చెప్పలేదని విష్ణుకుమార్ రాజు ఆరోపించారు. ఒక నియంత పాలనలో అధికారులు వ్యవహరించిన తీరుపై కూడా అభ్యంతరాలు ఉన్నాయన్నారు. 1 లక్ష 40 వేల చదరపు అడుగులు నిర్మాణాలు చేసారని, దీనికి మాత్రం 451 కోట్లు రూపాయలు నిధులు శాంక్షన్ చేసారన్నారు. చదరపు అడుగు నిర్మాణానికి 28 వేల 096 రూపాయలు ఖర్చు అయిందని, ఇంత ఖర్చు పెట్టీ పేదలకు, పెద్దలకు పోరాటం అని పేర్కొంటూ జగన్ బిల్డ్ అప్ ఇచ్చారని ఎద్దేవా చేశారు. రూ. 409 కోట్ల వ్యయం చేస్తే 22 వేల 743 మందికి పేదలకు ఇల్లు కట్టవచ్చునని అన్నారు. నిర్మాణాలకు ఖర్చు చదరపు అడుగు 24 వేల రూపాయలకు నిర్మించారని, ఫర్నిచర్ ఖరీదు రూ. 22 కోట్లు వ్యయం చేశారన్నారు. ముందు టూరిజం రిసార్ట్ అని చెప్పి ఆ తరువాత జీవో ఇచ్చారని అన్నారు. ముఖ్యమంత్రికి క్యాంప్ ఆఫీస్‌ను వెతికేందుకు ఒక కమిటీ వేసి రుషికొండ ప్యాలెస్‌ను సిఎంకు కేటాయించాలని కమిటీ సిఫార్సు చేసిందని, బాత్ రూంలో కమ్ ఔట్ ఖరీదు రూ. 16 లక్షలు అంట అని విష్ణుకుమార్ రాజు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆయన కమ్ ఔట్‌కు రూ.11 లక్షలు ఖర్చు అయిందని, ఈ కమ్ ఔట్‌లో స్పెషాలిటీ ఏమిటి అని అడిగితే ఆటో వాషింగ్ అని చెప్పారని, నాప్‌కిన్ వాడాల్సిన అవసరం లేదు అని చెప్పారని విష్ణుకుమార్ రాజు అన్నారు. స్నానం చేసేటప్పుడు 3 వే మిక్సింగ్ షవర్ ఖరీదు 4 లక్షల 3 వేల రూపాయలని, మెయిన్ డోర్ ఖరీదు రూ. 24 లక్షలు, డోర్‌కు ఉండే గ్రిల్ రూ. 12 లక్షలు, మార్బుల్ ఫ్లోరింగ్ చదరపు మీటరు రూ.37 వేల 706. కళింగ బ్లాక్‌లో మెయిన్ డోర్, గ్రిల్ కలిపి రూ.57 లక్షలు, వియత్నాం మార్బుల్ ఫ్లోరింగ్ చదరపు మీటరుకు తెల్ల మార్బుల్ రూ.79 వేలు ఖర్చు చేశారని విష్ణుకుమార్ రాజు పేర్కొన్నారు. ఈ క్రమంలో రేపు (శుక్రవారం) జీరో అవర్‌ను రద్దు చేసి దీనిపై చర్చ పెడదామని స్పీకర్ అన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణం రాజు మాట్లాడుతూ... ఈ రోజు తాను కూడా మాట్లాడుతానని... తనకు రేపు అవకాశం ఉండదని ఆయన అన్నారు. రేపు మళ్ళీ జీరో అవర్ ఉండదు కదా అన్న రఘురామ కృష్ణం రాజు వ్యాఖ్యలకు స్పీకర్ అంగీకరించారు. మళ్లీ విష్ణు కుమార్ రాజు మాట్లాడుతూ ఏమి చేయనిదానికి చంద్రబాబును 53 రోజులు జైలులో పెట్టారని, తెలుగు వాళ్ళు ప్రపంచ వ్యాప్తంగా బాధపడ్డారని అన్నారు. మరి ఇంత దుర్వినియోగం చేసిన జగన్ జీవిత కాలం జైలులో ఉంచాలి కదా అని విష్ణు కుమార్ రాజు అన్నారు. అధికార దుర్వినియోగంపై ప్రజలు తగిన బుద్ధి చెప్పారని దీనిపై వెంటనే చర్చ చేపట్టి జగన్‌ను జైల్లో పెట్టాలని విష్ణు కుమార్ రాజు అన్నారు.

సుప్రీంకోర్టుకు కూడా అబద్ధం చెప్పారు : రఘురామ కృష్ణం రాజు

రుషికొండపై తాను హైకోర్టుకు వెళ్లానని.. తనపై సుప్రీం కోర్టుకు కూడా అబద్ధం చెప్పారని రఘురామ కృష్ణం రాజు అన్నారు. సిఎం నివాసం కోసం అని చెబితే అది అబద్ధం అని కోర్టుకు చెప్పారన్నారు. అప్పటి వరకు టూరిజం ప్రాజెక్టు అని చెప్పి ఆ తరువాత సిఎంకు నివాసం అని చెప్పారన్నారు. అధికారుల కమిటీ వెళ్తుంటే వాళ్లకు రుషికొండ నివాసం కనిపించిందట..వెంటనే వాళ్ళు రుషికొండ సిఎం నివాసానికి పనికొస్తుందని చెప్పారన్నారు. రూ. 400 కోట్లు పెట్టీ జగన్ రాజకీయ సమాధి కట్టుకున్నారని, మనం నెగెటివ్‌లో కూడా పాజిటివ్ వెతుక్కోవాలన్నారు. ఈ ప్యాలెస్ కట్టడం వలనే జగన్ పతనం ప్రారంభమైందన్నారు. ఈ కట్టడాన్ని మంచి భవనంగా తీర్చి దిద్దాలన్నారు. అందరి మనోభావాలను తెలుసుకున్న తరువాత దీనిపై సోమవారం ప్రత్యేక చర్చ చేపట్టాలని నిర్ణయం తీసుకుందామని స్పీకర్ అయ్యన్న పాత్రుడు అన్నారు. దీంతో రుషికొండపై చర్చ ముగిసింది.

## ఢిల్లీకి సీఎం చంద్రబాబు

అమరావతి, నవంబర్14: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటన ఖరారు అయింది. శుక్రవారం మధ్యాహ్నం 1.00 గంటకు సీఎం చంద్రబాబు ఢిల్లీ బయలు దేరి వెళ్లనున్నారు. అందుకోసం వెలగపూడిలోని సచివాలయం ఎదురుగా ఉన్న హెలి ప్యాడ్ నుంచి హెలికాప్టర్‌లో గన్నవరం విమానాశ్రయానికి చేరుకోనున్నారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో ఆయన ఢిల్లీకి వెళ్లనున్నారు. సాయంత్రం 3:45 గంటలకు సీఎం చంద్రబాబు ఢిల్లీ చేరుకుంటారు. ఈ ఢిల్లీ పర్యటనలో భాగంగా పలువురు కేంద్ర మంత్రులతో ఆయన భేటీ కానున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై వారితో ఆయన చర్చించనున్నారు. అలాగే ఢిల్లీలోని బీజేపీ పెద్దలతో సైతం ఆయన సమావేశం కానున్నారు. ఇక శనివారం ఢిల్లీ నుంచి మహారాష్ట్రకు సీఎం చంద్రబాబు బయలుదేరి వెళ్లనున్నారు. మహారాష్ట్ర అసెంబ్లీకి జరగనున్న ఎన్నికల ప్రచారంలో సీఎం చంద్రబాబు పాల్గొను న్నారు. ఎన్డీయే తరపున ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. మహారాష్ట్రలో ఎలాగైనా అధికారాన్ని నిలుపుకోవాలని మహాయుతీ కూటమి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది. దీంతో బీజేపీ, బీజేపీ సంకీర్ణ ప్రభుత్వంలోని భాగస్వామ్య పక్ష పార్టీల అధినేతలు మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ.. సూడిగాలి ప్రచారం నిర్వహిస్తున్నారు.




## వైసీపీ పాలనపై అసెంబ్లీలో పవన్‌కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు



అమరావతి : ఏపీలో ఐదేళ్ల పాటు పాలన కొనసాగించిన వైసీపీపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. దురదృష్టవశాత్తు 2019లో నేరస్తులు అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాల్లో రఘురామకృష్ణరాజు డిప్యూటీ స్పీకర్‌గా ఏకగ్రీవ ఎన్నిక సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం రాజకీయాలను నేరమయం చేసిందని విమర్శించారు. నేరస్థులు అధికారంలోకి వస్తే ఏం జరుగుతుందో మొన్నటి వరకు చూశామని పేర్కొన్నారు. క్రిమినల్స్ మైంట్‌సెట్‌తో ఉన్న వ్యక్తులు అధికారంలోకి వస్తే రాజ్యాంగానికి, రాజ్యాంగ విధానాలకు, వ్యవస్థలకు గౌరవం ఇవ్వరని విమర్శించారు. సుప్రీం కోర్టు జడ్జిలను వదలలేదు, పార్టీ కార్యకర్తలను వదలలేదని వివరించారు. సొంతపార్టీ ఎంపీని కూడా దారుణంగా హింసించిన చరిత్ర గత పాలకులదని అన్నారు.

# సంపాదకీయం

శుక్రవారం 15-11-2024

## సమానత్వం నినాదమేనా

స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ మన దేశంలో మహిళలకు స్వేచ్ఛ, సమానత్వం లేదు. ఆకాశంలో సగం అంటూ పేరున్న మహిళలు ఇప్పటికీ అధికారానికి దూరంగా ఉంటున్నారు. 75 సంవత్సరాల ప్రజాస్వామ్య పాలనలో, ఒక మహిళా ప్రధానమంత్రి, ఒక మహిళా అధ్యక్షురాలు మాత్రమే అధికారం చేపట్టగా, మిగిలిన వారందరూ పురుషులే. దేశవ్యాప్తంగా మహిళల అభివృద్ధికి, లింగ సమానత్వానికి మధ్య అంతరం రోజురోజుకూ పెరుగుతోంది. కొంతమంది మేధావులు స్త్రీలు, పురుషులు సమానమని, కానీ పురుషులు కొంచెం ఎక్కువ సమానమని చెబుతారు. ఫలితంగా మహిళల అభివృద్ధి, సమానత్వం అనేవి కేవలం మాటలుగానే మిగిలిపోతున్నాయి. సంప్రదాయాల పేరుతో నేటి స్త్రీలను పురుషుల అణిచివేతకు గురిచేస్తూనే ఉన్నారు. అయితే, రాజ్యాంగం స్త్రీలను, పురుషులను సమానంగా గుర్తించి గౌరవిస్తుంది. ఆర్టికల్ 15(3) ప్రకారం రాష్ట్రం మహిళల అభివృద్ధి, అభ్యున్నతి కోసం ప్రత్యేక చట్టాలు చేయవచ్చు. ఆర్టికల్ 39(బి) ప్రకారం సమాన వేతనాలు చెల్లించాలి. ఆర్టికల్ 39(ఎ) ప్రకారం స్త్రీ, పురుషులకు సమాన జీవనోపాధి కల్పించాలి. ఆర్టికల్ 15ం(ఇ) ప్రకారం ప్రతి పౌరుడు మహిళల గౌరవాన్ని కాపాడేందుకు కృషి చేయాలి. అయితే దేశంలోని ప్రతి అంశంలోనూ రాజకీయ జోక్యం వల్ల వారి అభివృద్ధి కుంటుపడుతోంది. కాలంతో పాటు సమాజం, ఆలోచనలు రెండూ మారుతున్నాయి. కానీ, మహిళల విషయంలో మాత్రం ఇది భూమిపై కనిపించదు. ఇది ఆధునిక యుగం.. ఈ యుగంలో మనిషి సైన్స్ ద్వారా రోజుకో కొత్త అవిష్కరణలకు జీవం పోస్తున్నాడు. కానీ, స్త్రీలకు పురుషులతో సమానంగా హక్కులు కల్పించే విషయంలో సమాజం శతాబ్దాల వెనక్కి వెళుతుంది. ప్రపంచబ్యాంకు నివేదిక కూడా అదే నమ్ముతుంది. ప్రపంచ బ్యాంకు 2023లో ప్రచురించిన నివేదిక ప్రకారం ప్రపంచంలోని 14 దేశాల్లో మాత్రమే మహిళలకు వ్యాపారం, చట్టంలో సమాన హక్కులు ఉన్నాయి. ఈ దేశాలు బెల్జియం, కెనడా, డెన్మార్క్, ఫ్రాన్స్, గ్రీస్, ఐస్లాండ్, ఐర్లాండ్, లాట్వియా, లక్సెంబర్గ్, పోర్చుగల్, స్పెయిన్, స్వీడన్, జర్మనీ , నెదర్లాండ్స్. చట్టపరమైన వ్యాపార దృక్కోణంలో పురుషులు, మహిళలకు పూర్తి సమాన హక్కులను అందించే 14 దేశాలు ఇవి. 2023లో తొలిసారిగా 100 పాయింట్లు సాధించిన వారి జాబితాలో జర్మనీ, నెదర్లాండ్‌లు చేర్చబడ్డాయి. అంటే ఈ రెండు దేశాలు స్త్రీ, పురుషుల హక్కులను అనేక విషయాల్లో సమానంగా చేశాయి. అత్యంత పేదరికాన్ని అంతం చేయడం మరియు భాగస్వామ్య శ్రేయస్సును పెంచడం అనే ప్రపంచ బ్యాంక్ లక్ష్యాలకు లింగ సమానత్వం ప్రధానమైనది. ఎక్కువ లింగ సమానత్వం, మహిళల ఆర్థిక సాధికారత యొక్క మొత్తం ఎజెండా కూడా స్మార్ట్ ఎకనామిక్స్ అని విశ్వసిస్తున్నారు ఎందుకంటే ఇది ఉత్పాదకతను పెంచుతుంది తర్వాతి తరం సామాజిక అభివృద్ధి కోసం అవకాశాలు సహా ఇతర అభివృద్ధి ఫలితాలను మెరుగుపరుస్తుంది. అమ్మాయిలు, మహిళలు అబ్బాయిలు పురుషులకు సమానమైన హక్కులు అవకాశాలు లేకపోతే ఏ సమాజం, దేశం లేదా ఆర్థిక వ్యవస్థ తన పూర్తి సామర్థ్యాన్ని సాధించలేవని రుజువైంది. మహిళల ఆర్థిక సాధికారత సాధించడం చాలా పెద్ద పని. ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ అంచనాల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్యం గత దశాబ్దాలుగా మహమ్మారికి ముందు 50% కంటే తక్కువగా ఉంది. టర్కీలో, గత కొన్ని దశాబ్దాలుగా స్త్రీల శ్రామిక శక్తి భాగస్వామ్యం పురుషుల కంటే కనీసం 2:1 కారకంతో స్థిరంగా వెనుకబడి ఉంది. కరోనా మహమ్మారి దానిని మరింత దిగజార్చింది: 66% మంది పురుషులతో పోలిస్తే, కేవలం 29% మంది మహిళలు కార్మిక శక్తిలో పాల్గొంటున్నారు. కానీ మహిళల ఆర్థిక భాగస్వామ్యం వల్ల కలిగే ప్రయోజనాలు అపారమైనవి. జీతంతో కూడిన ఉద్యోగాలలో పని చేయడం సమాన వేతనాలు పొందడం ద్వారా మహిళలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సమాన భాగాన్ని కలిగి ఉంటే ప్రపంచ సంపద గణనీయంగా పెరుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా లింగ సమానత్వం మరియు మహిళల ఆర్థిక సాధికారతను ప్రోత్సహించడం మా పనికి ఎల్లప్పుడూ ప్రధానమైనది మరియు కొనసాగుతుంది, కానీ ముఖ్యంగా మహమ్మారి ప్రభావం నుండి కోలుకోవడానికి మేము కృషి చేస్తున్నప్పుడు. ప్రపంచ బ్యాంక్ గ్రూప్ యొక్క పని లింగ సమానత్వంపై ఒక వ్యూహంతో మార్గనిర్దేశం చేయబడింది, ఇది విద్య ఆరోగ్యంలో లింగ అంతరాలను మూసివేయడం, మరింత మెరుగైన ఉద్యోగాలకు అడ్డంకులను తొలగించడం మరియు మహిళల యాజమాన్యం భూమిపై నియంత్రణకు అడ్డంకులను తొలగించడం వంటి అనేక కీలక రంగాలపై దృష్టి సారించింది. , హౌసింగ్ మరియు బ్యాంక్ ఖాతాలు. ఉదాహరణకు, తల్లిదండ్రుల సెలవు హక్కు సమానంగా చేయబడింది. ఇది కాకుండా, పురుషులు, స్త్రీలను సమానంగా ఉంచే అనేక హక్కులు ఉన్నాయి. వెస్ట్ బ్యాంక్, గాజా ఈ జాబితాలో అట్టడుగున ఉన్నాయి. ఇక్కడ మహిళలకు వాణిజ్యపరమైన, చట్టపరమైన హక్కులు దాదాపు లేవు. దీని తరువాత యెమెన్, సూడాన్ , ఖతార్ ఉన్నాయి. ఈ దేశాల్లో కూడా మహిళలకు వృత్తిపరమైన, చట్టపరమైన హక్కులు చాలా తక్కువ. 2019 జాబితాలో సౌదీ అరేబియా అట్టడుగున ఉంది. కానీ, ఇటీవల అక్కడ అమలులోకి వచ్చిన కొత్త చట్టాల తర్వాత సౌదీ అరేబియా స్కోరు మెరుగుపడి 71.3 శాతంతో 136వ స్థానంలో ఉంది.

# విద్యార్థులు చదువుకుంటేనే జీవితాలు బాగుపడుతాయి...



విభారే న్యూస్ నవంబర్ 14 కర్నూలు జిల్లా ప్రతినిధి..విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి. అల్లుగుండు గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవం. విద్యార్థులతో ముచ్చటించి బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెల్పిన జిల్లా ఎస్పీ. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు చదువుకుంటనే జీవితాలు బాగుపడతాయని కర్నూలు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్ పేర్కొన్నారు. వెల్దుర్తి పోలీసుస్టేషన్ పరిధిలోని అల్లుగుండు గ్రామ ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. బాలల దినోత్సవం పురస్కరించుకుని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య

**- జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్.**

అతిథిగా జిల్లా ఎస్పీ పాల్గొన్నారు. అల్లుగుండు గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రోజా మొక్కలను అందజేసి బాలల దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు. స్కూల్ ఆవరణంలో కొబ్బరి మొక్కను నాటారు. పాఠశాల పిల్లలకు ఇష్టమైన చాక్లెట్లు, బిస్కెట్లు, పెన్నులు, నోట్ బుక్స్, లంచ్ బాక్సులను, స్టీల్ వాటర్ బాటిల్స్ జిల్లా ఎస్పీ అందజేశారు. ఈ సంధర్బంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో అక్షరాస్యత పెంచాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించడం కోసం ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామమైన అల్లుగుండు గ్రామంలో బాలల దినోత్సవ కార్యక్రమం చేపట్టామన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్దులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. పాఠశాల విద్యార్దులు శ్రద్ధగా చదువుకోవాలన్నారు. పాఠ్య పుస్తకాలు చదివేటప్పుడు ఏమైనా సందేహాలు వస్తే విద్యార్దులు అధ్యాపకులను అడిగి తెలుసుకోవాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో , లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని తమ చదువును కొనసాగించి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. గ్రామంలో 80 మంది విద్యార్థులు మాత్రమే పాఠశాలకు వస్తున్నారన్నారు. పాఠశాల విద్యార్థుల హాజరును ఎక్కువ సంఖ్యలో పెంచడానికి బాలల రక్షణ, హక్కుల కోసం పనిచేసే వివిధ విభాగాల సిబ్బంది, సమన్వయంతో పనిచేయాలన్నారు. బాల్యదశలోనే గుడ్ టచ్, బ్యాడ్ టచ్ ల గురించి విద్యార్దులకు తెలియజేయాలన్నారు. విద్యార్దులకు మంచి ప్రవర్తన, నడవడిక నేర్పించాలని పాఠశాల అధ్యాపకులకు సూచించారు. దివంగత మాజీ దేశ ప్రదాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ సేవలు మరువలేనివన్నారు. దివంగత నెహ్రూ కి పిల్లలన్నా, గులాబీలన్నా అమితమైన ప్రేమ అన్నారు. ఆయుణ్ని ముద్దుగా 'చాచా నెహ్రూ', 'చాచాజీ' అని పిలుచుకునేవారన్నారు. 1964లో నెహ్రూ మరణించిన తర్వాత ఆయన పుట్టిన రోజును 'బాలల దినోత్సవం'గా నిర్వహించాలని భారత ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఆనాటి నుంచి నవంబర్ 14 ను 'చిల్డ్రన్స్ డే'గా జరుపుకొంటున్నామన్నారు. దేశ తొలి ప్రదానిగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహువ ంతులు అందించారు. ఎవైనా సమస్యలుంటే చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్లు 1098,118,112,100 లపై గ్రామాల్లో సంబంధిత శాఖల అధికారులు ప్రజలకు అవగాహన కల్పించి, ప్రతి ఒక్కరూ ఆ నెంబర్లను సద్వినియోగం చేసుకునే విధంగా ప్రజల్లో చైతన్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐలు ప్రసాద్, అబ్దుల్ గౌస్, వెల్దుర్తి సర్కిల్ సిఐ మధుసూధన్, వెల్దుర్తి ఎస్సై అశోక్, పాఠశాల అధ్యావకులు, విద్యార్ధులు పాల్గొన్నారు.

# ప్రజలు అపరిచితుల మాటలు నమ్మిమోసపోవద్దు...



విభారే న్యూస్ నవంబర్ 14 కర్నూలు జిల్లా ప్రతినిధి..కర్నూలు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్. సెంట్రల్ ఫండ్ నుండి రూ. 20 కోట్ల నిధులు అప్పుగా ట్రాన్సఫర్ చేస్తామని నమ్మించి మోసం. జిఎస్టీ క్రింద రూ. 15 లక్షలు ఇస్తే నిధులు ట్రాన్ఫర్ చేస్తామని మోసాలకు పాల్పడుతున్న నిందితులు. బెంగుళూరుకు చెందిన నలుగురు వ్యక్తులు అరెస్టు, మహింద్రా రెడ్ కలర్ కారు, 4 సెల్ ఫోన్లు స్వాధీనం. చాక చాక్యంగా 12 గంటలలోపే 4 గురు నిందితులను అరెస్టు చేసిన కర్నూలు టు టౌన్ పోలీసులను అభినందించిన జిల్లా ఎస్పీ. డబ్బులు వస్తాయని అతిగా నమ్మి మోసపోవడమే ప్రధాన కారణం ఇలాంటి మోసాల బారిన పడకండి.. జిల్లా ఎస్పీ. కర్నాటక రాష్ట్రం, బళ్ళారి జిల్లా, సిద్దవరం గ్రామానికి చెందిన జె. సోమశేఖర్ అనే వ్యక్తికి బెంగళూరు కు చెందిన హారిష్ ఏ హర్ష అనే వ్యక్తి పరిచయమై తాను తనకు విప్రో, ఇన్ ఫోసిస్, టిసిఎస్ లాంటి పెద్ద కంపెనీలతో పరిచయాలు ఉన్నాయి. మీరు ఎదైనా ఫ్యాక్టరీ గానీ, ప్రవేట్ ట్రస్టు గానీ ఏర్పాటు చేస్తుంటే సదరు కంపెనీల నుండి రూ. 20 కోట్ల నిధులు అప్పుగా ఇప్పిస్తానని చెప్పి నమ్మించారు. కానీ సదరు రూ. 20 కోట్ల నిధులు అమలు చేయాలంటే దానికి గాను రూ. 15 లక్షల నగదు జిఎస్టీ నిమిత్తం తనకు ముందుగానే చెల్లించాలని నమ్మబలికారు. ఇందుకు గాను, సోమశేఖర్ అయిన నేను, నా మిత్రుడు బసవరాజు కలిసి ఇది నిజమని నమ్మినాము. నిన్నటి దినం అనగా 13.11.2024 సదరు హర్ష అనే వ్యక్తి మా మిత్రుడు సోమశేఖర్, బసవ రాజులకు ఫోన్ చేసి మీరు రూ. 15 లక్షలు తీసుకొని కర్నూలు టౌన్ , రాజ్ విహార్ లాడ్జ్ రూమ్ నెంబర్ 304 కు వచ్చి మాకు డబ్బులు రూ. 15 లక్షలు ఇస్తే మీ బ్యాంకు ఖాతాలలో రూ. 20 కోట్లు మీ ఖాతాలో జమ చేయిస్తామని మాకు మాటలు చెప్పి నమ్మించారు. మేము దీనిని నిర్థారించుకునే నిమిత్తం నేను, నా మిత్రుడు బసవరాజు దగ్గరకు నిన్నటి రోజు సాయంత్రం 6 గంటల 30 నిమిషాలకు కర్నూలు, రాజ్ విహార్ హోటల్ 304 రూమ్ నెంబర్ దగ్గరకు వెళ్ళాము. అక్కడ రూమ్ లో 1) హారీష్ ,అతనితో పాటు 2) బాను ప్రతాప్, 3) ప్రతాప్ రెడ్డి, 4) శ్రీధర్ (వీరందరిది బెంగుళూరు) అనే వ్యక్తులు కూడా ఉండి వారు చెప్పే మాటలు మోసపూరితంగా ఉన్నందున సదరు విషయం వెంటనే అనుమానంతో కర్నూలు రెండవ పట్టణ పోలీసులకు కాల్ చేసి మేము సమాచారం అందించాము. వారు తప్పించుకునే ప్రయత్నం చేశారు. మేము భయపడి అక్కడి నుండి పక్కకు వచ్చాము. జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్ ఆదేశాలతో కర్నూలు టు టౌన్ సిఐ నాగరాజా రావు, వారి సిబ్బంది వెంటనే అప్రమత్తమయి, చాక చాక్యంగా 12 గంటలలోపే ఆ నలుగుర్నీ రాత్రికి రాత్రే పట్టుకున్నారు. వారు ప్రయాణించిన ఎర్ర కలర్ మహింద్రా కారు ఐం 02ఓా 0137,4 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్టు చేయడం లో కీలక పాత్ర వహించిన కర్నూలు టు టౌన్ సిఐ నాగరాజా రావు, కర్నూలు టు టౌన్ ఎస్సై మోహన్ కిశోర్, సిబ్బందిని కర్నూలు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలు ఎవ్వరూ కూడా ఇలాంటి మోసాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ తెలిపారు.

# ఎమ్ ఆర్ పీ కంటే ఎక్కువ ధరకు అమ్మితే కఠిన చర్యలు

**జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ**

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 14- ఎమ్ ఆర్ పీ కంటే ఎక్కువ ధరకు పురుగుల మందు అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ. మండల వ్యవసాయ అధికారి ప్రసాద రావు పేర్కొన్నారు. గురువారం పలు పురుగులు మరియు ఎరువుల దుకాణాలను




జిల్లా వ్యవసాయ అధికారి వై. వి.మురళీ కృష్ణ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారి ప్రసాద రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ . శ్రీ నంది ఏజెన్సీస్ మరియు గోళ్ళ వెంకట నారాయణ శెట్టి పురుగు మందుల దుకాణాలలో పలు పత్రాలు, రిజిస్టర్ లు, బిల్ బుక్స్ మరియు నిల్వలు పరిశీలించామని తెలిపారు . పురుగు మందుల దుకాణం దారులు రోజు స్టాక్ బోర్డు అప్డేట్ చెయ్యాలన్నారు , అదేవిధంగా స్టాక్ బుక్ నిలువలు మరియు గ్రౌండ్ నిలువలు ఒకే విధంగా ఉండేట్లు చూసుకోవాలని సూచించారు , అనుమతి ఉన్న పురుగుమందుల మాత్రమే విక్రయించాలన్నారు , అదేవిధంగా ప్రతీ సంవత్సరం పురుగుమందుల లైసెన్సు కల్గిన డీలర్లు అందరూ వారి లావాదేవీలు వివరాలు జిల్లా వ్యవసాయ అధికారికి సమర్పిం చాలన్నారు. డీలర్లు అందరూ పురుగు మందుల చట్టం 1968 కి అనుగుణంగా వ్యాపారం చేసుకోవాలని, అలా చెయ్యని యెడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు .

## సహకార సంఘాల కంటే కమర్షియల్ బ్యాంకులు ఆర్థికంగా ఎంతో ముందుకు వెళ్తున్నాయి

**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా**

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 14- సహకార సంఘాల కంటే కమర్షియల్ బ్యాంకులు ఆర్థికంగా ఎంతో ముందు వెళ్తున్నాయని. సహకార సంఘాలలోని లోటుపాట్లను అధిగమించి సహకార సంస్థల బలోపేతానికి సమిష్టి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. గురువారం నంద్యాల పట్టణంలోని జెవిఆర్ నగర్ హౌస్ బిల్డింగ్ కోఆపరేటివ్ సొసైటీ ఆవరణంలో 71 వ అఖిలభారత సహకార సంఘాల వారోత్సవాలలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సహకార పతాకాన్ని ఆవిష్కరించి జిల్లాలో అఖిల భారత సహకార ప్రారంభోత్సవాలను ప్రారంభించారు. జిల్లా సహకార అధికారి వెంకటసుబ్బయ్య, జేవిఆర్ నగర్ సిహెచ్ బిఎస్ సంఘ అధ్యక్షులు నారాయణ, డిఆర్డిఏ పిడి శ్రీధర్ రెడ్డి, ఉమ్మడి జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ జనరల్ మేనేజర్ శివలీల, విజయ డైరీ మేనేజింగ్ డైరెక్టర్ ప్రదీప్ కుమార్, కోయిలకుంట్ల కో-ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులు సముద్రాల శ్రీనివాసరావు, రాష్ట్ర సహకార యూనియన్ ప్రతినిధి ఎన్ నర్సింహారెడ్డి, సహకార సంఘాల పాలకవర్గ సభ్యులు, గ్రామ ఐక్య సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ సహకార సంఘాల బలోపేతానికి అన్ని సంఘాల పాలకవర్గ సభ్యులు, సహకార శాఖ అధికారులు, బ్యాంకు సిబ్బంది, ప్రాథమిక సహకార సిబ్బంది తమ వంతు కృషి చేయాలన్నారు. సహకార చట్టాలకు, బైలాలకు సంఘ సభ్యులు లోబడి పనిచేస్తూ సహకార సంఘాల అభివృద్ధికి దోహదం చేయాలని కలెక్టర్ తెలిపారు. సహకార సంస్థల నిర్వీర్యానికి అవకాశం ఇవ్వకుండా సహకార సంస్థలలోని లోటుపాట్లను అధిగమించి అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని కలెక్టర్ పేర్కొన్నారు.

# ఆళ్లగడ్డ లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



విభారె న్యూస్ నవంబర్ 14 ఆళ్లగడ్డ ప్రతినిధి :- ఆళ్లగడ్డ తాలూకా సంఘం అధ్యక్షులు అమిర్ భాషా ఆధ్వర్యంలో గురువారం బాలల దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక ఇండియన్ గ్లోబల్ హైస్కూల్లో కరస్పాండెంట్లు దస్తగిరి బాషా, వెంకటేశ్వర రెడ్డి, ప్రసాద్ రెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమిర్ భాష మాట్లాడుతూ భారత జాతీయ స్వాతంత్ర ఉద్యమంలో జవహర్లాల్ నెహ్రూ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. పిల్లలతో చాచా నెహ్రూ కు ఉన్న అనుబంధం కారణంగా ఆయన పుట్టిన రోజును బాలల దినోత్సవం గా జరుపుకుంటున్నామనీ అమిర్ భాష పేర్కొన్నారు. అలాగే ఏ.వి.ఆర్, విజ్ఞాన భారతి పాఠశాలల్లో బాలల దినోత్సవం వేడుకలు జరిగాయి.

# 18 సంవత్సరాలు పైబడిన వారు క్యాన్సర్ పరీక్షలు చేయించుకోండి

**--జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా**

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 14-18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించుకోవాలని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి అన్నారు. గురువారం నంద్యాల పట్టణంలోని ఎన్జీవో కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో అందరికీ క్యాన్సర్ వ్యాధి పరీక్షల నిర్వహణ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ సంబంధిత క్యాన్సర్ వ్యాధి పరీక్షలు చేయించుకుని ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి తగిన సలహాలు, చికిత్సలు తీసుకోవడం వల్ల ద్వారా భవిష్యత్తులో జరిగే దుష్పరిణామాలను నివారించుకోవచ్చున్నారు. ప్రస్తుతం మన జీవన విధానంలో ఆరోగ్య అలవాట్లు మారుతున్న నేపథ్యంలో నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ మరియు గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్, మధుమేహం, రక్తపోటు మొదలైన అసంక్రమిక వ్యాధులు అధికంగా వస్తున్నాయన్నారు.

# దుర్గాబ్యాంక్ దివాళ...

విజయవాడ, నవంబర్ 14,విజయవాడలో దశాబ్దాల చరిత్ర ఉన్న దుర్గా కోఆపరేటివ్ బ్యాంకు దివాళా తీసింది. బ్యాంకు ఆర్థిక పరిస్థితి ప్రమాదకర స్థాయికి చేరడంతో ఆర్‌బిఐ లైసెన్స్ రద్దు చేసింది. బ్యాంకు మొండి బకాయిలు, వడ్డీలతో కలిపి రూ.200కోట్లకు చేరువలో ఉండటంతో ఆర్‌బిఐ బ్యాంక్ లైసెన్స్ రద్దు చేసింది.గత కొన్నేళ్లుగా విచ్చలవిడిగా రుణాలను మంజూరు చేయడం, ఆర్‌బిఐ మార్గదర్శకాలను పాటించకపోవడంతో బ్యాంకు దివాళా తీసేలా నిర్వహణ సాగింది. చివరకు ఆర్‌బిఐ విచారణలో బ్యాంకులో అవకతవకలు బయటపడటంతో లైసెన్స్ రద్దైంది. దీంతో డిపాజిటర్ల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. బ్యాంకులో అధిక వడ్డీ వస్తుందనే ఉద్దేశంతో డిపాజిట్లు చేసిన వారంతా లబోదిబోమంటున్నారు.విజయవాడ పాతబస్తీ దుర్గా కో- ఆపరేటివ్ అర్బన్ బ్యాంకుకు ఆర్‌బిఐ అనుమతులు రద్దు చేయడం కలకలం రేపింది. బ్యాంకు నిర్వహణలో అవకతవకల పై కొన్నాళ్లుగా ఆరోపణలు వస్తున్నాయి. గత ఐదేళ్లలో రాజకీయ జోక్యం అధికం కావడంతో బ్యాంకు డైరెక్టర్ల నియామకంలో చోటు చేసుకున్న అక్రమాలతో బ్యాంకు పరిస్థితి దయనీయం మారింది. 90ఏళ్ల చరిత్ర ఉన్న దుర్గా కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు గతంలో కూడా ఎన్నో ఉడిదుడుకులు ఎదుర్కొంది.తాజాగా రిజర్వ్ బ్యాంకు లైసెన్సు రద్దు చేస్తూ ఉత్తర్వులు వెలువరించడంతో బ్యాంకులో డిపాజిటర్లలో కలకలం రేపింది. గత కొన్నేళ్లుగా రుణాల మంజూరులో బ్యాంకులో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా రుణాలు మంజూరు చేయడం, సరైన తనిఖీలు లేకుండా పట్టా భూములకు రుణాలు మంజూరు చేయడం, అవి తిరిగి వసూలు కాకపోవడం వంటి సమస్యలు బ్యాంకు ఎదుర్కొంటోంది. బ్యాంకు నిర్వహణపై ఆరోపణలు, ఫిర్యాదులు రావడంతో కొంత కాలంగా ఆర్‌బిఐ విచారణ జరుపుతోంది.బ్యాంకు లావాదేవీల నిర్వహణకు తగినన్ని నిల్వలు లేకపోవడంతో చెల్లింపులు కూడా నిలిచిపోయాయి. డైరెక్టర్ల మధ్య విభేదాలతో రాష్ట్ర ప్రభుత్వానికి, ఆర్‌బిఐకు ఫిర్యాదులు అందాయి. 1926లో ఏర్పాటైన దుర్గా కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకుకు ఘన చరిత్ర ఉంది. నగరంలోని నాలుగు స్తంభాల సెంటర్, సత్యనారాయణపురంలో బ్యాంకు శాఖలు ఉన్నాయి. దుర్గా కో- ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎన్నిక విజయవాడ రాజకీయాలను శాసించే స్థాయిలో జరిగేది. బ్యాంకు ఛైర్మన్ పదవిని దక్కించుకోడానికి ప్రధాన పార్టీలు పోటీపడేవి.కొన్నేళ్లుగా రాజకీయ జోక్యం మితిమీరడంతో బ్యాంకు పతనం దిశగా పయనించింది. బ్యాంకులో మొండి బకాయిలు పెరిగిపోయాయి. డిపాజిట్లు చేసిన వారికి కూడా గడువు ముగిసినా చెల్లింపులు చేయలేని స్థితికి బ్యాంకు చేరింది. దీంతో ఖాతాదారులు పలుమార్లు ఆందోళ నకు దిగారు. బ్యాంకు రుణాల జారీలో ఉద్యోగులు, పాలక మండలి డైరెక్టర్ల చేతివాటంతో పారుబకాయిలు పెరిగిపోయాయి. బ్యాంకు మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని గతంలో కో ఆపరేటివ్ రిజిస్ట్రార్ నుంచి పలుమార్లు హెచ్చరికలు వచ్చినా ప్రజా ప్రతినిధుల అండతో చర్యలు నిలిచిపోయాయి. చివరకు ఆర్‌బిఐ అనుమతి రద్దు చేస్తున్నట్టు ప్రకటించడంతో డిపాజిటర్లలో ఆందోళన నెలకొంది.బ్యాంకు డిపాజిటర్లలో దాదాపు 95శాతం మంది రూ.5లక్షల్లోపు డిపాజిటర్లు కావడంతో వారికి దశల వారీగా చెల్లింపులు జరుపనున్నట్టు ఆర్‌బిఐ అధికారులు వివరించారు. ఐదేళ్ల లక్షలకు పైబడిన డిపాజిట్లపై ఉన్నత స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉందని చెబుతున్నారు.దుర్గా కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు దగ్గర తగిన మూల ధనం లేకపోవడం, బ్యాంకు నిర్వహణ సామర్థ్యం లేకపోవడంతో బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్ 1949 ప్రకారం లైసెన్స్ రద్దు చేస్తున్నట్టు ప్రకటించిది. బ్యాంక్ కార్యకలాపాలు అనుమతిస్తే డిపాజిటర్ల ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందని ఆర్‌బిఐ పేర్కొంది. ప్రస్తుత పరిస్థితుల్లో బ్యాంకు డిపాజిటర్లకు పూర్తి స్థాయిలో చెల్లింపులు జరిపే స్థితిలో దుర్గా కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లేదని ఆర్‌బిఐ వెల్లడించింది.2024 నవంబర్ 12 తర్వాత బ్యాంకింగ్ వ్యాపార కార్యకలాపాలు నిలిచిపోతాయని ప్రకటించింది. బ్యాంకును మూసివేసి లిక్విటేడర్‌ను నియమించాలని కమిషనర్ ఆఫ్ కో ఆపరేషన్ అండ్ రిజిస్ట్రార్ ఆప్ కో ఆపరేటివ్స్ సొసైటీని ఆర్‌బిఐ సూచించింది. లిక్విడేషన్‌లో ప్రతి డిపాజిటర్‌కు డిపాజిట్‌పై బీమా క్లెయిమ్ చెల్లిస్తారు. డిపాజిట్ ఇన్స్యూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ ద్వారా గరిష్టంగా ఐదు లక్షల వరకు చెల్లిస్తారు. బ్యాంకు రికార్డుల ప్రాకరం డిపాజిటర్లలో 96శాతం మంది ఈ పరిహారం పొందడానికి అర్హత కలిగి ఉన్నారు. డిపాజిట్లలో పూర్తి మొత్తాన్ని డీఐసీజీసీ నుంచి పొందుతారని ఆర్‌బిఐ వివరణ ఇచ్చింది. ఐదు లక్షలకు మించిన డిపాజిట్లపై కసరత్తు చేస్తున్నారు.

# పెరిగిన సీఆర్డీఏ పరిధి

గుంటూరు, నవంబర్ 14,ఏపీ క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిని కుదించడంతో అమరావతి పరిధి గణనీయంగా తగ్గిపోయింది. దీనిని పూర్వపు స్థితికి చేరుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సిఆర్‌డిఏ ఏర్పాటైన సమయంలో భవిష్యత్ అవసరాలతో పాటు భారీ నగరాన్ని నిర్మించే లక్ష్యంతో సిఆర్‌డిఏను విజయవాడ-గుంటూరు నగరాల చుట్టూ 8వేల చదరపు కిలోమీటర్ల పరిధి నిర్ణయించారు.2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజధాని పరిధిని ,సిఆర్‌డిఏ పరిధిని కుదించారు. పల్నాడు, బాపట్ల పట్టణాభివృద్ధి సంస్థలను ఏర్పాటు చేశారు. తాజాగా పూర్వపు సిఆర్‌డిఏ పరిధిని పునరుద్ధరిస్తూ మునిసిపల్ శాఖ ఉత్తర్వులు జారీ చేశారు. సత్తెనపల్లి పురపాలక సంఘంతో పాటు పల్నాడు జిల్లాలోని 92గ్రామాల్లోని 1,069.55చదరపు కి.మీ విస్తీర్ణానికి పెంచారు. దీంతో పాటు బాపట్లలో 562.41 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో కలిపి మొత్తం 1631.96చదరపు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని సీఆర్‌డిఏలోకి చేరుస్తూ మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి కన్నబాబు ఉత్తర్వులు జారీ చేశారు.ఏపీ సీఆర్‌డిఏ పరిధి, విస్తీర్ణాన్ని రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించింది. ఉమ్మడి గుంటూరులోని బాపట్ల, పల్నాడు జిల్లాల్లో గత ప్రభుత్వం విడదీసిన పలు ప్రాంతాలను తిరిగి సీఆర్డీఏలో విలీనం చేస్తూ పురపాలక శాఖ జీవో విడుదల చేసింది.తాజా నిర్ణయంతో సీఆర్డీఏ విస్తీర్ణం 6,983.24 చదరపు కి.మీ నుంచి 8,352 69 చ.కి.మీకు పెరిగింది. సీఆర్‌డిఏ పరిధి పెంపుదలపై ఆగస్టు 2న సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సీఆర్‌డిఏ ఆథారిటీ సమావేశంలో తీర్మానానికి ఆమోదం తెలిపారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో సీఆర్‌డిఏ విస్తీర్ణం పెంపుకు క్యాబినెట్ ఆమోదముద్ర వేయడంతో తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు.2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఆర్డీఏ నుంచి వేమూరు నియోజకవ ర్గాన్ని బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీలో భాగం చేశారు. సత్తెనపల్లి, పెదకూరపాడు, చిలకలూరిపేట నియోజకవర్గాల్లో ఉన్న ప్రాంతాలను విడదీసి పల్నాడు అర్బన్ డెవ లప్మెంట్ ఆథారిటీలో విలీనం చేశారు. దీంతో సీఆర్‌డిఏ పరిధి గణనీయంగా తగ్గిపోయింది. సీఆర్‌డిఏ పరిధిని కుదించేందుకు ఇలా చేశారనే విమర్శలు ఉన్నాయి.గతంలో సీఆర్డీఏ పరిధిలో ఉన్న సత్తెన పల్లి మునిసిపాలిటీలోని 21.88 చ కి.మీతో పాటు సత్తెనపల్లి మండలం, పెదకూరపాడు నియో జకవర్గంలోని పెదకూరపాడు, అమరావతి, క్రోసూరు, అచ్చంపేట మండలాలు, చిలకలూరిపేట నియోజకవర్గంలోని యడ్లపాడు మండలాలను పల్నాడు డెవలప్‌మెంట్ అథారిటీలో కలిపారు. వాటిని ఇప్పుడు సీఆర్డీఏలో కలిపారు.సత్తెనపల్లి మున్సిపాలిటీతో పాటు గ్రామీణ మండలం, పెదకూరపాడు, అమరావతి, క్రోసూరు, ఆచ్చంపేట, యడ్లపాడు మండలాల్లోని 82 గ్రామాల పరిధిలో 1,069.55 చదరపు కిలోమీటర్ల మేర విస్తీర్ణం రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థలో కలిసింది. దీంతో పాటు వేమూరు నియోజక వర్గంలోని ఐదు మండలాలను 562. 41 చ కి.మీ విస్తీర్ణాన్ని సీఆర్డీఏ నుంచి విడగొట్టి బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీలో విలీనం చేశారు. చుండూరు, అమృతలూరు, వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు మండలాలను కూడా బుడాలో కలిపారు. తాజా నిర్ణయంతో ఈ మండలాల పరిధి లోని 62 గ్రామాలు సీఆర్డీఏలో విలీనమైనట్టైంది.

# సోషల్ మీడియాకు సినిమాటిక్ కలర్


ఒంగోలు, నవంబర్ 14, ప్రకాశం జిల్లా మద్దిపాడు పీఎస్‌లో ఈనెల 10న దర్శకుడు రామ్‌గోపాల్ వర్మపై ఫిర్యాదు నమోదు కావడం.. ఏపీలో సోషల్ మీడియా రగడను కొత్త మలుపు తిప్పేసింది. మద్దిపాడు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి రామలింగం ఫిర్యాదు మేరకు ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి.. దర్యాప్తు ప్రారంభించారు. ఈనెల 19న విచారణకు హాజరుకావాలంటూ వర్మకు నోటీసులు వెళ్లాయి. ఎస్ఐ శివరామయ్య ఆధ్వర్యంలో స్పెషల్ టీమ్ హైదరాబాద్‌లోని వర్మ ఆఫీసుకు వెళ్లి స్వయంగా నోటీసులు హ్యాండోవర్ చేశారు. వ్యూహం సినిమా ప్రమోషన్‌లో భాగంగా సోషల్ మీడియాలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేష్, బ్రహ్మణిపై అభ్యంతరకర పోస్టులు పెట్టారన్నది వర్మపై నమోదైన అభియోగం.ఎన్నికలకు ముందు, టీజర్ ట్రైలర్లతోనే సంచలనం సృష్టించిన మూవీ వ్యూహం. అప్పట్లో ఆ సినిమా విడుదల ఆపాలంటూ కోర్టును కూడా ఆశ్రయించింది టీడీపీ. ఈ సినిమా సెన్సార్‌ను తెలంగాణా హైకోర్టు రద్దు చేసినా, డివిజన్ బెంచ్‌లో వర్మ సవాల్ చేయడంతో మరోసారి సినిమా మీద రివ్యూ జరిగింది. బెంగుళూరు సెన్సార్‌బోర్డు ఆ సర్టిఫికెట్ ఇవ్వడంతో సినిమా థియేటర్లలో రిలీజైంది. గుంటూరు జిల్లా తుళ్లూరులో కూడా ఖీఉం మీద కేసు నమోదైంది. రాష్ట్ర తెలుగు రైతు సంఘం ఉపాధ్యక్షుడు నూతలపాటి రామారావు ఫిర్యాదు మేరకు ఈఎఖీ నమోదు చేశారు పోలీసులు. ఈ కేసులోనూ నోటీసులిచ్చే అవకాశం ఉంది. దేనిమీదైనా.. ట్విట్టర్‌లో తనదైన స్టయిల్‌గా రియాక్టవడం వర్మకు అలవాటు. కానీ.. ఏఐ వీడియోలతోనో, అమెరికా ఎన్నికల ఫలితాల మీదో టైమ్‌పాస్ చేస్తున్నారు తప్ప.. తనమీద నమోదౌతున్న కేసుల పరంపరపై వర్మ ఖాతాల్లో చిన్న ప్రస్తావనైనా లేకపోవడం ఆసక్తికరంగా మారింది. పోలీసు కేసుల్ని తేలిగ్గా తీసుకుంటారని, వీలైతే ఎంజాయ్ చేస్తారని చెబుతున్నారు ఆయన ఫాలోయర్లు.నటుడు, రచయిత పోసాని కృష్ణమురళిపై కూడా ఏపీలో కేసు నమోదైంది. విజయవాడ భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో పోసానిపై ఫిర్యాదు చేశారు జనసేన నాయకులు. 2021 సెప్టెంబర్‌లోనూ, 2024 ఏప్రిల్‌లోనూ వైసీపీ కార్యాలయం వేదికగా పవన్ కళ్యాణ్‌పై పోసాని కృష్ణ మురళి చేసిన వ్యాఖ్యల్ని ప్రస్తావిస్తూ.. ఆయనపై చర్యలు తీసుకోవాలని కంప్లైంట్ చేశారు. పోసాని మాటల్ని వైసీపీ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారంలో పెట్టి.. పవన్‌కల్యాణ్ ప్రతిష్టను దెబ్బతీశారన్నది కంప్లయింట్ సారాంశం. ఐపీసీ సెక్షన్ 153, 153జీ, 354జీ, 505 క్లాజ్ 1, క్లాజ్ ఇ, క్లాజ్ 2 ప్రకారం వర్మపై కేసు నమోదైంది. కానీ.. తాను పవన్ కల్యాణ్‌పై తప్పుడు వ్యాఖ్యలేమీ చేయలేదని, తాను చెప్పినవన్నీ నిజాలేనని రియాక్టయ్యారు పోసాని.కానీ.. పవన్‌నుద్దేశించి పోసాని దారుణమైన పదజాలంతో పరుషంగా మాట్లాడారని వాదిస్తోంది జనసేన. గతంలో కూడా పోసానిపై ఫిర్యాదు చేసినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదని చెబుతున్నారు. అటు.. వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్టులపై కేసుల పరంపర కొనసాగుతోంది. జనసేన, టిడిపి నేతల ఫిర్యాదులతో పోలీసులు చురుగ్గా కదులుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 48 మందిపై కేసులు నమోదయ్యాయి. వీరిలో 11 మందిపై గరిష్టంగా ఐదు కేసులు పెట్టారు. 22 మందికి 41ఏ నోటీసులిచ్చి పంపారు. మిగిలినవారు జిల్లా జైళ్లలో ఉన్నారు. జూనియర్ ఆర్టిస్ట్, వైసీపీ సానుభూతిపరురాలు శ్రీరెడ్డిపై అనకాపల్లి టౌన్ పీఎస్‌లో కంప్లయింట్ నమోదైంది. కూటమి నేతలపై ఆమె చేసిన సీరియస్ కామెంట్లను ఫిర్యాదులో జతపరిచారు.పోలీసుల అదుపులో ఉన్న వర్రా రవీందర్‌రెడ్డి వాంగ్మూలం ఆధారంగా.. సజ్జల భార్గవ్ సహా ఐదుగురు వైసీపీ నేతలపై లుకౌట్ నోటీసులు జారీ చేశారు. ఇప్పటివరకు ఐదు బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు సజ్జల భార్గవ్ రెడ్డి. అటు.. ఎంపీ అవినాష్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డి కోసం గాలింపు కొనసాగుతోంది. అటు.. పోస్టులు పెట్టిన వైసీపీ కార్యకర్త రాజశేఖర్‌రెడ్డిని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంట్లో అరెస్టు చేశారు పోలీసులు. ఫేక్ అకౌంట్లతో వాళ్లమీద వాళ్లే పోస్టులు పెట్టుకున్నారని, పోలీసులు మాత్రం తమను టార్గెట్ చేస్తున్నారని వాపోతోంది వైసీపీ.అటు.. కేసులను, అరెస్టులను తీవ్రంగా తీసుకున్న వైసిపి అదే స్థాయిలో ప్రతిఘటిస్తోంది. ఇప్పటికే జాతీయ మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేసింది. పెట్టినవారిని చట్టబద్ధంగానే అరెస్టు చేస్తున్నామ ంటూ సమర్థించుకుంటోంది ప్రభుత్వం. ప్రభుత్వం నుంచి జీతాలు తీసుకుని ప్రతిపక్షాన్ని టార్గెట్ చేశారని, దీనిపై కేంద్ర ఎన్నికల ఎలక్షన్ కమిషన్ స్పందించాలని, వైసీపీ గుర్తింపు రద్దు చెయ్యాలని డిమాండ్ చేస్తోంది టీడీపీ.

# గందరగోళంగా శాసనమండలి

అమరావతి,గురువారం నాడు శాసనమండలి ప్రారంభం కాగానే ఒక్కసారిగా గందరగోళంగా మారింది. వైకాపా ఎమ్మెల్యసీలు సోషల్ మీడియా పోస్టులపై, అక్రమ అరెస్టులపై చర్చించాలని పట్టుబట్టారు. వైసీపీ ఎమ్మెల్సీల నిరసన నేపథ్యంలో ఐదు నిమిషాల పాటు మండలి వాయిదాపడింది. 32 నిమిషాల పాటు వైసీపీ ఎమ్మెల్సీలు మండలి చైర్మన్ పోడియం వద్ద నిరసన తెలియజేసారు. ప్రజాస్వామ్యం కాపాడాలంటూ నినాదాలు చేసారు. ఒక దశలో స్పీకర్ పోడియం ఎక్కారు. ఎమ్మెల్సీలు పోతుల సునీత, బల్లి కళ్యాణ చక్రవర్తి, కర్రి పద్మశ్రీ తమ రాజీనామాలను ఆమోదించాలని ప్లకార్డులు ప్రదర్శించారు. చైర్మన్ పోడియం పైకెక్కి ప్లకార్డులు ప్రదర్శించారు.

# కాకినాడలో వలసల పక్షులు సందడి

కాకినాడ, నవంబర్ 14,శీతాకాలం ప్రవేశంతోనే కాకినాడ జిల్లా కోరింగలో వివిధ రకాల పక్షుల సందడి వాతావరణం నెలకొంటుంది. ఆహార అన్వేషణలో భాగంగా వేల కిలోమీటర్ల దాటి ఇక్కడకు చేరుకుంటాయి ఈ అందమైన పక్షులు.. కాకినాడ జిల్లా కోరంగి అభయారణ్యం మడ అడవుల్లో ఆహారం లభించే చోట ఆవాసాలు ఏర్పాటు చేసుకుంటాయి. ఆరు నెలల పాటు అక్కడ ఉండి తిరిగి ఆయా దేశాలకు వెళ్తాయి.సైబీరియా, మంగోలియా, రష్యా చైనా ఒడిశాలోని మహానది, చంబల్ ప్రాంతాల నుండి విదేశీ వలస పక్షులు కోరింగ అభయారణ్యానికి చేరుకుంటాయి. ఇప్పటికి ఐ.పోలవరం మండలం బైరవ పాలేనికి ఇండియన్ స్కివర్ పక్షులు వచ్చాయి. నవంబరు నుండి మార్చి వరకు అభయారణ్యంలో 12 ప్రాంతాల్లో కనిపిస్తాయి. కోరంగిలోని హోప్ ఐలాండ్స్ కాకినాడ ఏటిమొగ, కుంభాభిషేకం, బీడి, బ్యాక్ వాటర్ కెనాల్, తాళ్లరేవు మండలం చొల్లం ఉప్పు మడులు, కాట్రేనికోన మండలం సాంకిమెంట్ లైట్ హౌస్, ఉప్పలగుప్తం మండలం ఎస్ యానాం ప్రాంతాల్లో కె.పొర వద్ద వలస పక్షులకు అనుకూల ప్రాంతంగా ఉంది. మడ అడవులు, చిత్తడి నేలలు వీటికి ఆహారం దొరికే ప్రాంతాలు.. సైబీరియా, మంగోలియా, రష్యా, చైనా వంటి దేశాల్లో పక్షులు ఉండే ప్రదేశాలు ఈ సీజన్లో మంచుతో కప్పేసి ఉంటాయి. ఆహార కొరత వంటి పరిస్థితుల కారణంగా అక్టోబరు నుంచి మార్చి వరకు ఇక్కడికి పక్షులు చేరుకుంటాయి. నత్తలు చేపలు జూప్లాంట్, చామస్ ఆహారాన్ని అధికంగా తింటాయి. అందుకే వివిధ రకాల అందమైన పక్షులు అనేక రకాల జాతులు పక్షులు ఒకే ప్రాంతానికి చేరుకుని కనివిందు చేస్తాయి.2024లో 108 జాతుల పక్షులను గుర్తించారు. కోరింగ అభయారణ్యం విస్తీర్ణం 235.76 కాగా పొడవు 15 కిలోమీటర్లు. మడ అడవులు 193 హెక్టార్లలో ఉన్నాయి. జనవరిలో విదేశాల నుంచి వచ్చే పక్షులను లెక్కిస్తారు. అందులో వివిధ సంస్థలు పాల్గొంటాయి. ఒక్కోచోట అయిదుగురు చొప్పున 12 ప్రాంతాల్లో 12 బృందాలను ఏర్పాటు చేస్తారు. ప్రత్యేక కెమెరాల ద్వారా పక్షులను గుర్తిస్తారు. 2011లో ఏర్పాటైన ఈ కౌంటింగ్ నేటికి కొనసాగుతోంది. 2016 నుంచి నేటికీ పక్షల సంఖ్య గణనీయంగా పెరిగింది. స్కిమ్మర్ ను అంతరించిపోతున్న పక్షుల జాబితాలో చేర్చడం విశేషం.



# మొహం చాటేస్తున్న అనిల్ కుమార్



నెల్లూరు, నవంబర్ 14,2024 ఎన్నికలకు ముందు పల్నాడు జిల్లా మొత్తం వైసీపి కంచుకోటగా ఉండేది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో సీన్ పూర్తిగా రివర్స్ అయింది. పల్నాడు జిల్లాలో అసెంబ్లీ స్థానాలతో పాటు నరసరావుపేట పార్లమెంటు స్థానంలోనూ వైసీపీ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. గత ఎన్నికల్లో నరసరావుపేట వైసీపీ ఎంపీ అభ్యర్థిగా మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ పోటీ చేశారు. అప్పటికి నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా ఉన్న అనిల్‌పై నియోజకవర్గంలో వ్యతిరేకత పెరిగిందని సర్వేల్లో తేలడంతో జగన్ అక్కడ అయన్ని పక్కన పెట్టేశారు.సరిగ్గా అదే టైంలో నరసరావుపేట వైసీపీ ఎంపీగా ఉన్న లావు కృష్ణదేవరాయుల్ని జగన్ గుంటూరు ఎంపీగా పోటీ చేయాలని ఆదేశించారు. దానికి నిరాకరించిన దేవరాయులు టీడీపీలో చేరిపోయి ఆ పార్టీ నరసరావుపేట ఎంపీ అభ్యర్థిగా ఫిక్స్ అయ్యారు. దాంతో నరసరావుపేటలో దేవరాయుల్ని ఢీ కొనే సమర్థుడైన నేత వైసీపీకి కరువయ్యారు. ఆ క్రమంలో నెల్లూరులో టికెట్ లేకుండా ఖాళీగా ఉన్న అనిల్ యాదవ్ నరసరావుపేట షిఫ్ట్ అవ్వాల్సి వచ్చింది. అయిష్టంగానే నరసరావుపేట ఎంపీ అభ్యర్థిగా వచ్చిన అనిల్ తర్వాత ప్రచారంలో దూకుడు పెంచారు. బీసీ కార్డు వాడుకుంటూ జగన్ తనకు ఎమ్మెల్యే నుంచి ఎంపీగా ప్రమోషన్ ఇచ్చారని హడావుడి చేశారు.తనకు రాజకీయ భవిష్యత్తు ఇవ్వాలని తన రాజకీయాలకు పల్నాడు జిల్లానే కరెక్ట్ అంటూ ప్రచారంలో ఓటర్లను ప్రాధేయపడ్డ అనిల్ కుమార్ యాదవ్.. ఓటమి తర్వాత పల్నాడు జిల్లా రాజకీయాల్లో ఎక్కడా కూడా కనిపించకపోవడం విశేషం.. వైసీపీ ప్రభుత్వంలో రెండున్నరేళ్లు మంత్రిగా పనిచేసిన అనిల్‌కుమార్ యాదవ్.. పల్నాడు జిల్లా రాజకీయాల్లో తనదైన శైలిలో దూసుకు వెళ్తారని పార్టీ వర్గాలు అంచనా వేశాయి.. చంద్రబాబుని, పవన్ కళ్యాణ్‌లపై బూతులతో చెలరేగిన అనిల్.. ఎన్నికల ప్రచారంలో స్థానిక నేతలు పైన కూడా పరుషపదజాలంతో విరుచుకుపడ్డారు.ఎన్నికల పోలింగ్ తర్వాత ఒకటి రెండు సార్లు పల్నాడు నేతలతో కలిసి మీడియా ముందుకు వచ్చిన అనిల్ ఎన్నికల ఫలితాల తర్వాత కనిపించడమే మానేశారు . హైదరాబాద్‌లో తన వ్యాపారలావాదేవీలు చూసుకుంటున్న ఆయన అప్పుడప్పుడు రహస్యంగా నెల్లూరు వచ్చి వెళ్తున్నారంట. కేసుల భయంతో ఆయన రాజకీయాలకు స్వస్తి పలికే ఆలోచనలో ఉన్నారంటున్నారు. ఆ క్రమంలో ప్రస్తుతం నరసరావుపేట పార్లమెంటు సెగ్మెంట్లో వైసీపీకి ఇన్చార్జ్ కరువయ్యారు.నరసరావుపేట ఇన్చార్జిగా వైసీపీ ఎవరిని నియమిస్తుంది? ఎప్పుడు నియమిస్తుంది? లావు కృష్ణదేవరాయుల్ని ఎదుర్కొనగలిగే సమర్థుడు ఎవరున్నారు? ప్రస్తుతం పల్నాడు పార్టీ శ్రేణుల్లో చర్చంతా దీని గురించే నడుస్తుంది. ప్రస్తుతం జిల్లాలో వైఎసీపీకి సంబంధించి ఎవరూ కూడా యాక్టివ్‌గా లేకపోవడంతో ఇన్చార్జ్‌గా ఎవరిని ప్రకటించే అవకాశాలు ఉన్నాయని దానిపైన నేతల్లోనూ క్లారిటీ లేదు.. పార్టీని దూకుడుగా ముందుకు తీసుకువెళ్లే నేత కోసం అధిష్టానం అన్వేషిస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది.. అందులో భాగంగా మాజీ ఎంపీ మోదుగుల వేణగోపాలరెడ్డిని మళ్లీ ఇంఛార్జ్‌గా పంపుతారని ప్రచారం జరుగుతుంది.అసెంబ్లీ కంటే పార్లమెంట్ కు వెళ్లటానికే మోదుగుల మొదట నుండి మొగ్గు చూపుతున్నారు. దీంతో పల్నాడు జిల్లా పరిశీలకుడిగా ఉన్న మోదుగులను పార్లమెంట్ ఇంఛార్జ్‌గా నియమించే అవకాశాలు ఉన్నాయంటున్నారు . టీడీపీలో ఒక సారి నరసరావుపే ఎంపీగా, ఒక సారి గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యేగా గెలిచిన మోదుగుల 2019 నాటికి వైసీపీలో చేరి విజయానికి ముఖం వాచిపోయి ఉన్నారు.

# రిషికొండ ప్యాలస్ నిర్మాన ఖర్చు రూ 409 కోట్ల 39 లక్షలు

## మంత్రి కందుల దుర్గేష్

అమరావతి,శాసనసభలో రిషికొండ ప్యాలెస్ కు సంబంధించి జరిగిన చర్చలో సభ్యుల ప్రశ్నలకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వివరణ ఇచ్చారు. మొదటి ప్రశ్నకు సమాధానంగా విశాఖపట్నం జిల్లా ఎండాడ గ్రామంలో సర్వే నెంబర్ 19 లో రిషికొండ పైన ఉన్నటువంటి 61 ఎకరాల విస్తీర్ణంలో 9 ఎకరాల 88 సెంట్లలో భవనాన్ని నిర్మించడం జరిగింది. 7 బ్లాక్ లతో ఉన్నటువంటి ఒక రిసార్ట్ ను ఏపీ టీడీసీ వాళ్ళు నిర్మించడం జరిగింది. రిషికొండలో భవనాల నిర్మిత విస్తీర్ణం పరిశీలిస్తే విజయనగరం, కళింగ, గజపతి, వేంగి బ్లాక్ లతో కలిపి మొత్తం ఐదు బ్లాక్ లు ఉన్నాయి. ఏ బ్లాక్ లో మళ్ళీ మొత్తం మూడు బ్లాకులు ఉన్నాయి. అన్ని బ్లాక్ ల నిర్మిత విస్తీర్ణం 1,45,765 చదరపు అడుగులు.. వీటి కోసం రూ. 222 కోట్ల 92 లక్షలు ఖర్చు అయ్యింది. భవనాలు కాకుండా చేపట్టిన మిగితా పనులు చూస్తే హార్డ్ స్కేపింగ్, స్లో ప్రొటెక్షన్ వర్క్.. వీటన్నింటికీ కలిపి రూ. 186 కోట్ల 47 లక్షలు ఖర్చయింది. 9 ఎకరాల 88 సెంట్లలో జరిగిన భవనాల నిర్మాణానికి, ఇతర పనులకు సంబంధించి మొత్తంగా రూ. 409 కోట్ల 39 లక్షలు ఖర్చు అయింది. దీనికి సంబంధించి ఒక్కొక్క చదరపు అడుగుకు (ఎస్ఎఫ్టీ కి) రూ. 23,261 ఖర్చు అయింది. రెండవ ప్రశ్నకు సమాధానంగా ఇతర అంశాలకు కోసం దాదాపు రూ. 71 కోట్ల 91 లక్షలు ఖర్చు అయింది. ఇది ఎండాడలో రిషికొండ భవనాల నిర్మాణానికి చేసిన వ్యయం, ఎన్ని ఎకరాల్లో భవనం నిర్మించారు అనడానికి సమాధానమని అన్నారు.

# తిరుపతి బైపాస్ లోఆర్సీ పురం జంక్షన్ వద్ద న రోడ్డు ప్రమాదం

## ఇద్దరు మహిళలు మృతి, మరో ఇద్దరికీ గాయాలు?

తిరుపతి,గురువారం తెల్లవారుజామున ఆర్సీపురం జంక్షన్ దగ్గర రోడ్డు ప్రమాదం జరిగింది. తిరుపతి రూరల్ మండలం ధనలక్ష్మి నగర్ క్షత్రియ ఎన్క్లేవ్ అపార్ట్మెంట్ వుంటున్నల బిల్డర్ గా రాజశేఖర్ రాజు గృహ ప్రవేశాని హాజరయిన బంధువులు తిరుగు ప్రయాణం లో ప్రమాదం జరిగింది.ఆర్సీ పురం క్రాస్ వద్ద హైవే పై కారులో రోడ్డు దాటుతున్నప్పుడు బాలాజీ ట్రావెల్ బస్సు డీకొంది. ఈ ప్రమాదం లో గాయాలయివారిని దగ్గరలోని ఆసుపత్రికి తరలించారు., సావిత్రి (80), సంగీత (38) చనిపోయారు. జ్యోతి, లక్ష్మి దేవి లు కు గాయాలయ్యాయి.

# వస్తాద్ క్రాంతివీర్ లాహూజీ సాల్వే 230 వ జయంతి జయంతి



విభారే న్యూస్ నవంబర్ 14. కర్నూల్ ప్రతినిధికర్నూలు నగరంలో ఆది జాంబవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వస్తాద్ క్రాంతివీర్ లాహూజీ సాల్వే 230 వ జయంతి ని పురస్కరించుకొని శ్రీశ్రీశ్రీ ఉమామహేశ్వరదేవాలయం వీకర్ సెక్షన్ కాలనీ కర్నూలు నందు జరిగిన ఈకార్యక్రమంలో వేల్పులగోపాల్ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య కోసం బ్రిటిష్ సామ్రాజ్యవాదుల కబందహస్తాల నుండి భరతమాతను విముక్తి పరచాలని సంకల్పంతో ఎందరో శిష్యులను తయారుచేసుకొని త్రివిధ దళములతో తిరుగుబాటు మొదలు పెట్టిన మహానుభావుడు వస్తాద్ క్రాంతివీర్ లాహూజీ సాల్వే ఈయన మహారాష్ట్రలో పుణెకు దగ్గర పురంధర్ అనే ప్రాంతం లో సర్దార్ రాగోజిసాల్వే విత్తభాయ్ అనే పుణ్య దంపతులకు 14-11-1794 లో జన్మించారు. చిన్న తనము నుండే సామాజిక కార్యక్రమమాలలో చాల చురుకుగా పాల్గొనేవారు తన స్నేహితులలో ఎవరికైన, ఏదేని సమస్య వస్తే తానే దగ్గరుండి పరిష్కరించేవారు ఇది గమనించిన ఆయన తండ్రి సర్దార్ రాగోజిసాల్వే తన కుమారుడి కి అన్నిరకాల దేహదారుఢ్య విద్యలను నేర్పించినారు ఆవిధముగా ఆరితేరిన లాహూజీ సాల్వేను నాటి సమాజం వస్తాద్ (మాస్టర్) అనే బిరుదుతో గౌరవించారు పూణేలోని మిథుగుంజి ప్రాంతంలో సాల్వే ఒక వ్యాయామశాలను ఏర్పాటు చేసినారు ఇక్కడ నుండి ఎందరో రత్నాల లాంటి విద్యార్థులను తీర్చిదిద్దారు

## కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి నాయకులు వేల్పుల గోపాల్..

ఇక్కడ విద్య నేర్చుకున్న విద్యార్థులలో ముఖ్యులు జ్యోతిరావుపూలే బాలగంగాధర్ తిలక్ వాసుదేవ్ బలవంత్ పాడకే సదాశివరావు పరాంజపే మోరో విఠల్ వాల్వేకర్ మొదలగు వారు ఆయన శక్తి సామర్థ్యాలను గ్రహించిన నాటి బ్రిటిష్ ప్రభుత్వం క్రాంతివీర్ అనే బిరుదుతో సత్కరించటం జరిగింది నాటి నుండి వస్తాద్ క్రాంతివీర్ లాహూజీ సాల్వే× గా గురించి కూడా బోధించేవారు. మనకు శారీరిక ఆరోగ్యం ఎంత ముఖ్యమో, ఈదేశ స్వాతంత్ర్యం కూడా అంతకంటే ఎక్కువ అని చెప్పేవారు బ్రిటిష్ పాలన నుండి భారతదేశాన్ని ఎలా విముక్తిచేయాలి అనేదానిపై ఎక్కువగా చర్చలు జరుగు తుండేవి. ఏదైనా అంశంపై నలుగురు వ్యక్తులు కూర్చొని మాట్లాడుకునే స్వేచ్ఛలేని చీకటి రోజులవి. సమా వేశాలకు అను మతులు ఉండేవికావు. భావస్వేచ్ఛ లేని బానిస జీవితాలు అప్పుడు. ప్రజలను రకరకాల కార ణాలతో విభజించి పాలిస్తున్న నికృష్ట పరిస్థితులు. అలాంటి సమయంలో ఒక రోజు అది 1817 సవంత్సరం, నవంబర్ 5 న ఖడ్కి దగ్గర జరిగిన యుద్ధంలో సాల్వే గారి తండ్రి బ్రిటిష్ సైన్యం చేతిలో వీరమరణం పొందటం జరిగింది. తన తండ్రి మరణాన్నికళ్లారా చూసిన క్రాంతివీర్ లాహూజీ సాల్వే, బాగా చలించిపోయారు. ఎలాగైనా బ్రిటిష్ వాళ్ళని, ఈ దేశం నుండి వెళ్ళగొట్టాలి అనే కసి, తన మనసులో బాగా బలపడింది. బ్రిటిష్ వాళ్ళని తరిమి కొట్టాలంటే, మనము కూడా యుద్ధ విద్యలలో ఆరితేరాలి అని తలచి, వందలాది మంది యువకులకు గొరిల్లా మొదలగు యుద్ధ రీతులు నేర్పటం జరిగింది. పూణే దగ్గరలో తన తండ్రి చనిపోయిన ప్రాంతంలో మాంగ్ వీర్ బాబ పేరుతొ ఒక స్మృతి భవనం నిర్మాణం చేయటం జరిగింది. భారత సమాజంలో ఉన్నకుల అసమానతలపై బాగ అవగాహన ఉన్న సాల్వే, భారతదేశానికి స్వాతంత్ర్యం రావాలంటే, సమాజంలో ఉన్న అన్ని వర్గాలవారు కలిసి నడవాలి అని భావించారు. అందుకే ఆయన శిష్యులలో ఒకరైన పూలేకు సామజిక అసమానతలపై పోరాడే బాధ్యతను ఇవ్వటం జరిగింది. ఆక్రమములోనే అంట రానివారి కోసం పాఠశాలలు తెరిచి, పూలే భార్యభర్తలు చదువుపై దృష్టిపెట్టటం జరిగింది. మరొక శిష్యుడైన బాలగంగాధర తిలక్ కు సాంస్కృతిక పరమైన, కార్యక్రమములు అప్పజెప్పటం జరిగింది. భారత జాతిని ఏక తాటి పైకి తేవాలంటే, బలమైన నినాదం కావాలని భావించి, జై శ్రీరామ్ అనే నినాదాన్ని, ప్రజలలోకి పంపటం జరిగింది. ఆక్రమములోనే వచ్చినదే గణేష్ నవరాత్రి ఉత్సవాలు, ఈవిధముగా ప్రజలను చైతన్య పరచే బాధ్యతను తిలక్ నిర్వహించటం జరిగింది. మరొక శిష్యుడైన వాసుదేవ్ బలవంత్ పాడకే కు ప్రత్యక్షముగా స్వాతంత్ర్యమును కోరుతూ ఉద్యమాలు చేసే బాధ్యతను అప్పజెప్పటం జరిగింది. మరికొందరికి బ్రిటిష్ స్థావరాలపై గొరిల్లా దాడులు చేసే విధముగా కార్యాచరణ ఇవ్వటం జరిగింది. సాహుమహారాజ్ బాల్యంలో, ఆయనను అంత మొందించాలని గుర్తుతెలియని దుండగులు దాడిచేయగా, దుండగుల నుండి రక్షించి, నాటి సమాజానికి ఒక మంచి సామజికవేత్తను అందించిన ఘనత క్రాంతివీర్ సాల్వే గారిది. ఎందరో మహాపురుషుల త్యాగాల ఫలితముగా నేడు మనం ఎంతో స్వేచ్ఛగా స్వాతంత్ర్యముగా జీవిస్తున్నాము ఈవిధముగా మన మొదటి తరం నాయకులను తయారుచేసి, లాహూజీ సాల్వే, భారతదేశానికి వేల కట్టలేని సేవ చేయటం జరిగింది కనుక అలాంటి భరతమాత ముద్దు బిడ్డ, జన్మదినమైన నవంబర్ 14 ని భారతదేశం స్వాతంత్ర్య సంకల్ప దినముగా జరుపుకోవటం, ఆకుటుంబానికి కృతజ్ఞత గాను మరియు ఆమహనీయునికి ఘననివాళిగాను ఉంటది, కాబట్టి ఇంతటి చారిత్రక ఘనకీర్తి కలిగిన వ్యక్తి గౌరవార్థం, జానకి రాముడు శివరామ్ శ్రీరామపవన్ రామాంజనేయులు సుంకన్న నాగార్జున సూర్యచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చక్కగా చదువుకుని, భవిష్యత్తులో రాణించాలి.

విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-నవంబర్ 14 డోన్ పట్టణం పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు ప్రధానోపాధ్యాయులు వెంకట సుబ్బారెడ్డి అధ్యక్షతన బాలల దినోత్సవం సందర్భంగా పండిట్ జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత దేశ మొదటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ పుట్టినరోజును పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నేడు బాలల దినోత్సవం జరుపుకుంటారు. పుట్టుకతోనే శ్రీమంతుడు అయిన నెహ్రూకు పిల్లలంటే ఎంతో ఇష్టం అంతేగాక ఆయన ధరించే కోటుకు గులాబీ పువ్వు ను ధరిస్తారు. నెహ్రూ జాతీయ కాంగ్రెస్ అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టి, మహాత్మా గాంధీ వెంట నడిచాడు. జైలుకు వెళ్లిన నెహ్రూ అక్కడ డిస్కవరీ ఆఫ్ ఇండియా గ్రంథ రచన చేశారు. ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టి పంచశీల సూత్రాలను చేపట్టి, బహుళార్థక సాధక ప్రాజెక్టులు చేపట్టారు. అందులో నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఒకటి. 1947 నుండి 1964 వరకు ఎక్కువ కాలం ప్రధాన మంత్రి గా పనిచేశారు. ఆ తర్వాత తన కూతురు ఇందిరాగాంధీ రాజకీయ రంగం లో ప్రవేశించి మొదటి మహిళా ప్రధానమంత్రి గా పనిచేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్ ఎన్ కాలనీ ప్రధానోపాధ్యాయులు డాక్టర్ తొగట సురేష్ బాబు ని ఉపాధ్యాయ బృందం శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుతో పాటు క్రమశిక్షణ నేర్చుకుని రాణించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా తీసుకున్న మెమొంటో, మెడల్, సర్టిఫికెట్ లను ప్రదర్శించారు. విద్యార్థులు చక్కని నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు వెంకట లక్ష్మి, అల్లిపీరా,రాధ, రఘునాథ్, ఎస్తేరమ్మ, లక్ష్మీకాంతరెడ్డి, మద్దిలేటి, సుబ్బరాయుడు, మధుసూదన్ రెడ్డి, విజయకుమార్, సుభాన్, శ్రీనివాసులు, జయసుబ్బరాయుడు, శివన్న, ఆదినారాయణ, లీలావతమ్మ, సంజీవరెడ్డి, రమేష్, దేవేంద్రప్ప, భాను ప్రకాష్ రెడ్డి, లక్ష్మీ ప్రభావతి, హుస్సేన్ భాను, ప్రసాద్ రావు, ముని రాజు, మహేష్, అల్లిపీరా, తదితరులు పాల్గొన్నారు.




# భారత ప్రజాస్వామ్య సాధానికి నిర్మాత జవహర్ లాల్ నెహ్రూ

## జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పి మురళీకృష్ణ



విభారే న్యూస్ నవంబర్ 14 కర్నూల్ ప్రతినిధి భారత ప్రజాస్వామ్య సౌధానికి నిర్మాత పండిట్ జవహర్ లాల్ నెహ్రూఅని కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే , తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి మాజీ సభ్యులు పి మురళీకృష్ణ అభిప్రాయ పడ్డారు. జవహర్ లాల్ నెహ్రూ 135 వ జయంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. మనకు స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం భారత తొలి ప్రధాన మంత్రిగా పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఎన్నిక అయ్యారని, నెహ్రూ మంచి పరిపాలనా దక్షుడని ఆగర్భ శ్రీమంతుడయినా నిరాడంబరుడని, స్వాతంత్ర్య ఉద్యమంలో జైలు జీవితం గడిపాడని నెహ్రూ మంచి రచయితగా, పండితుడుగా, చరిత్రకారుడిగా భారతదేశ రాజకీయాల్లో శక్తివంతమైన నాయకుడిగా ఎదిగారని భారత దేశ మొదటి ప్రధాని అయ్యాక దేశాన్ని అనేక సంక్షోభాల నుండి గట్టెక్కించాడని నెహ్రూ భారత ప్రజాస్వామ్య సౌధానికి నిర్మాత అయ్యాడని ప్రజాస్వామిక విధానం ఐదేళ్ల ఎన్నికల విధానం వల్లనే సాధారణ వ్యక్తులు ప్రజా ప్రతినిధులు కాగలుగుతున్నారని ప్రజాస్వామ్యంలో నియంతల మెడలు వంచేది ఎన్నికల విధానమేనని ఈ ఎన్నికల విధానం లేకపోతే భారతదేశం కూడా మరో పాకిస్థాన్ లా, మయన్మార్ లా తయారై ఉండేదని సమసమాజ స్థాపనే పరిపాలన లక్ష్యం కావాలని నెహ్రూ ఆకాంక్షించారని, ఆయనకు చిన్న పిల్లలంటే అమితమైన ప్రేమ అని అందుకే ఆయన పుట్టినరోజును బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నామని మురళీకృష్ణ ఆయన చేసిన సేవలను కొనియాడారు. ముందుగా పార్టీ కార్యాలయంలో పండిట్ జవహర్లాల్ నెహ్రూ చిత్రపటమునకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పి మురళీకృష్ణ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం జరిగినది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర బాబు, పార్లమెంటు సమన్వయకర్త పీజీ రామ్ పుల్లయ్య యాదవ్, సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని భాష, కాంగ్రెస్ నాయకులు కే వెంకటరెడ్డి, ఎన్ సి బజారన్న, పోతుల శేఖర్, సత్యనారాయణ గుప్త, షేక్ ఖాజా హుస్సేన్, మహేంద్ర నాయుడు, రియాజుద్దీన్, ఈ లాజరస్ అనంతరత్నం మాదిగ, ఎస్ సారమ్మ, ఎస్ ప్రమీల ఏ వెంకట సుజాత, సాంబశివుడు, బి సుబ్రహ్మణ్యం డబ్ల్యూ సత్యరాజు జాన్ సదానందం, ఎజాస్ అహ్మద్, తిప్పన్న నాయుడు, పశుపల, ప్రతాపరెడ్డి, రమేష్, షేక్ మాలిక్ భాష, ఐ ఎన్ టి యు సి నాయకులు ఎన్ సుంకన్న, ఆర్ ప్రతాప్, కాంగ్రెస్ వసి బాషా, అక్బర్, రంగస్వామి, కేశవరెడ్డి రెడ్డి, లోక రామయ్య మహిళా కాంగ్రెస్ కరుణమ్మ, పుష్పలీల మొదలగు వారు పాల్గొన్నారు.

# ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలి :- సిపిఎం డిమాండ్




విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-నవంబర్ 14 రాష్ట్రంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిపిఎం పార్టీ జిల్లా నాయకులు ఏ. రాజశేఖర్,సిపిఎం పార్టీ పట్టణ మండల కార్యదర్శులు నక్కి శ్రీకాంత్ కోయిలకొండ నాగరాజు డిమాండ్ చేశారు గురువారం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం పార్టీ జిల్లా నాయకులు ఏ.రాజశేఖర్, సిపిఎం పార్టీ పట్టణ,మండల కార్యదర్శులు నక్కి శ్రీకాంత్, కోయలకొండ నాగరాజు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఒక మాట అధికారంలోకి వచ్చాక ఒక మాట మాట్లాడుతుంది, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు మేం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలే పెంచము అని అన్నారు కానీ ఇప్పుడు 18 వేల కోట్ల రూపాయలు ట్రూ ఆఫ్ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ భారాలు మోపుతున్నాడు, దీనికి సమాధానం చెప్పాల చంద్రబాబు నాయుడు ఇది మాట తప్పడం కాదా అని ప్రశ్నించారు, అలాగే ఉచిత ఇసుకను అమలు చేస్తానని చెప్పిన బాబు అధికారంలో కొచ్చి ఐదు నెలలు అవుతున్న రాష్ట్రంలో ఎక్కడ కూడా ఉచిత ఇసుక పథకం అమలు జరగడం లేదు,అలాగే మేము అధికారంలోకి వస్తే నిత్యవసర వస్తువుల ధరలు తగ్గిస్తామన్నారు ఇది ఇంతవరకు అమలు జరగడం లేదు, అదేవిధంగా ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు ఇది ఇంతవరకు అమలు కాలేదు, నిరుద్యోగ భృతి ప్రతి ఒక్కరికి 3000 వేలు అందజేస్తామన్నారు ఈరోజు నిరుద్యోగ భృతి గురించి మాట్లాడే దాఖలు ఎక్కడ కనబడడం లేదు,అలాగే విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపుతామన్నారు దీని గురించి కూడా మాట్లాడడం లేదు ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా మహిళల పైన మైనార్టీల పైన, దళితుల పైన,చిన్నారుల పైన అత్యాచారాలు,హత్యలు జరుగుతున్నాయి వీటిని అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది అని వారన్నారు.పోలవరం ప్రాజెక్టును ఎప్పుడు పూర్తి చేస్తామో చెప్పడం లేదు పోలవరం నిర్వాసితులకు పరిహారం ఇస్తామన్నారు దీని గురించి కూడా మాట్లాడడం లేదు అదేవిధంగా రాజ్యాంగ వ్యతిరేక జమిలి ఎన్నికలకు టిడిపి ప్రభుత్వం కూటమి వత్తాసు పలుకుతుంది, అనేక సమస్యల తో రాష్ట్రంలోని ప్రజలు అనేక రకాలు ఇబ్బందులు పడుతుంటే ప్రతిపక్షంలో ఉన్న జగన్ ప్రభుత్వం చూస్తూ ఊరుకుంది, అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం ప్రజల సమస్యలను పక్కనపెట్టి ప్రజల పైన పన్నులు ఎట్లా వేయాలా, ప్రజల నుండి ఎలా దోచుకోవాలా అని ఆలోచిస్తుంది అందుకే సిపిఎం పార్టీగా ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఇచ్చిన హామీలు అమలుకై సిపిఎం పార్టీ ప్రజా పోరుకు సిద్ధమైందని వారు తెలిపారు.

# నేడు పౌర్ణమి సందర్భంగా గౌరీ శంకర స్వామికి ప్రత్యేక పూజలు..

విభారే న్యూస్ నవంబర్ 14 కర్నూలు జిల్లా ప్రతినిధి..శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ వారి దివ్య ఆశీస్సులతో శ్రీ సూర్యనారాయణ స్వామి వారి దేవాలయంలో పవిత్రమైన కార్తీక మాస15-11-2024 శుక్రవారం పౌర్ణమి సందర్భంగా ప్రాతఃకాలంలో ఉదయం 6 గంటల నుండి 10 :30 వరకు శ్రీ గౌరీ శంకర స్వామి వారికిరుద్రాభిషేకములు ఉదయం 11గంటలకు నవగ్రహ గణపతి మృత్యుంజయ పాశుపత రుద్ర హోమం సహిత శ్రీ లలితా హోమం జరపబడును అనంతరం సాయంత్రం 6 గంటలకు శ్రీ పరమేశ్వర ప్రీత్యర్థం కార్తీక పౌర్ణమి సందర్భంగా జ్వాలాతోరణం నిర్వహించబడును శివశక్తులకు అత్యంత ప్రీతిదాయకమైన కార్తీక పౌర్ణమి రోజు చేసే అభిషేకం హోమం జప దానాలు అత్యంత పుణ్యప్రదమైనది, శివానుగ్రహం వలన ఆయురారోగ్య ఐశ్వర్య భోగ భాగ్యములు సిద్ధించగలవురుద్రాభిషేకం-200పాశుపత రుద్ర హోమం-3500హోమ సంకల్పం-116సంప్రదించవలసిన నెం :- డి.లక్ష్మీనరసింహ శర్మ :- 8008774086 దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబరు:8896123777.

# కేజీబీవీ ఎస్ఓ ను ఉద్యోగం నుండి తొలగించకపోతే దశలవారీగా పోరాడుతాం..

## - జిల్లా అధికారులు స్పందించకపోతే కలెక్టరేట్ ముట్టడిస్తాం.






విభారే న్యూస్ నవంబర్ 14 ఎమ్మిగనూరు...అవినీతి ఆరోపణలు ఎదుర్కొని ఉద్యోగం నుండి తొలగించబడిన ఎమ్మిగనూరు కేజీబీవీ ఎస్ఓ మళ్లీ విధుల్లోకి తీసుకోవడం దారుణమని విద్యార్థి సంఘాల నాయకులు నరసన్న,శేఖర్,మహేంద్ర బాబు,వీరేష్ యాదవ్,సురేంద్ర బాబు, క్రిష్ణ, రఘునాథ్,అజిత్, వెంకటేష్,నాగరాజు అన్నారు. గురువారం స్థానిక పట్టణంలో ఎంఆర్ఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్ వీరభద్ర గౌడ్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా ఎమ్మిగనూరు కేజీబీవీ పాఠశాలలోనే విధులు నిర్వహిస్తూ విద్యార్థులకు చాలీచాలని అన్నం పెడుతూ మౌలిక వసతులు కల్పించకుండా విద్యార్థుల కడుపుకోట్టి ఆమె కడుపు నింపుకొని అవినీతి అరాచకాలకు పడుతుంది అని గతంలో అనేక సందర్భాలు ఫిర్యాదు చేయడతో సంబంధిత అధికారులు విచారణ చేసి ఎస్ఓ గా తొలగిస్తే మూడు నెలల వ్యవధిలోనే కోర్ట్ అనుమతి ఇచ్చిందని మళ్ళీ విధుల్లోకి తీసుకోవడమే కాకుండా అక్కడే పోస్టింగ్ ఇవ్వడం దారుణమన్నారు. అవినీతి అక్రమాల కేజీబీవి ఎస్ఓ కవిత కు అధికారులు, రాజకీయ అండదండాలు ఇవ్వడం కూడా విడ్డురంగా ఉందన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి కేజీబీవీ ఎస్ఓ గా తొలగించకపోతే కలెక్టరేట్ ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు చాంద్ బాషా, చరణ్,హరి,నరసింహ రెడ్డి, దావీదు తదితరులు పాల్గొన్నారు.

# కోసిగి మండలం లో ఫోక్సో కేసులో ముగ్గురు నిందితులు అరెస్టు.

విభారే న్యూస్ నవంబర్ 14 కోసిగి.. కోసిగి పోలీసుస్టేషన్ లో కేసు నమోదు.వైయస్ ఆర్ సిపి సర్పంచ్ బోయ ఉసేని,అతని మిత్రులైన వైయస్ ఆర్ సిపి అనుచరులు బోయ తోవి వినోద్,బోయ మజ్జిగ సూర్య నారాయణ అరెస్టు.అరెస్టు చేసి ఆదోని కోర్టుకు తరలించిన కోసిగి పోలీసులు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190